క్లుప్తంగా

అన్నదానం

వి.కోట: పట్టణంలో ఏ–వన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. పేదలకు, షికారి కాలనీ వాసులకు ఆహార పొట్లాలను అందజేశారు. సభ్యుడు సలీంబాయ్, నాగరాజు, మునాఫ్ సైనిక్ పాల్గొన్నారు.

ఘనంగా రామానుజన్ జయంతి


విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న టీచర్ల బృందం

సదుం: తన గణిత మేథోశక్తితో భారతదేశానికి వన్నె తెచ్చిన ఘనత రామానుజన్‌కు దక్కిందని స్థానిక జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం జయకుమార్ రెడ్డి అన్నారు. గురువారం గణిత మేధావి రామానుజన్ జయంతిని సదుం జెడ్పీ హైస్కూల్లో ఘనంగా నిర్వహించారు. గణితంపై విద్యార్థులు ఆసక్తి పెంపొందించుకోవాలని హెచ్‌ఎం సూచించారు. విద్యార్థులకు వక్తృత్వ, వ్యాస రచన, రంగోలి పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. మ్యాథ్స్ టీచర్ వేణుగోపాల్ రెడ్డి ఇంటర్మీడియెట్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు.

శైవ, వైష్ణవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

పుంగనూరు: ధనుర్మాసం సందర్భంగా పుంగనూరు ఆర్టీసీ డిపో నుంచి శైవ, వైష్ణవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డీఎం సుధాకరయ్య తెలిపారు. ధనుర్మాసంలో ప్రత్యేకంగా కడప, ఒంటిమిట్ట, అత్తిరాల, నందలూరుతో పాటు నారాయణవనం, అప్పలాయగుంట, వకుళామాత తదితర ఆలయాలను భక్తులు సందర్శించడం సాంప్రదాయం అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని జనవరి 4, 5, 11 తేదీలలో ప్రత్యేక బస్సులు ఆయా ప్రాంతాలకు నడపనున్నట్టు వెల్లడించారు. ఇందుకు సంబంధించి రిజర్వేషన్లు, ఇతర వివరాలకు ప్రజలు డిపోలో సంప్రదించాలని లేదా సెల్ నంబర్: 9100941850కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలియజేశారు.

5 కొత్త బస్సు సర్వీసులు ప్రారంభం


బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్న మునిరత్నం

కుప్పం: కుప్పం ఆర్టీసీ డిపోలో కొత్తగా 5 బస్సులను రాష్ట్ర ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం గురువారం ప్రారంభించారు. కుప్పం నుంచి విజయవాడకు రెండు, తిరుపతి, తిరుమలకు మూడు బస్సు సర్వీసులను అదనంగా ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు. కుప్పం డిపో ఆధునీకరణకు, అవసరమున్న మార్గాల్లో అదనపు సర్వీసులు నడిపేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్, టీటీడీ బోర్డు సభ్యుడు శాంతారామ్ తదితరులు పాల్గొన్నారు.

మోగిన బార్ ఎన్నికల నగారా


నామినేషన్లు తీసుకుంటున్న న్యాయవాదులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు న్యాయవాద సంఘం (బార్) ఎన్నికల నగారా మోగింది. నగరంలోని జిల్లా న్యాయస్థానాల సముదాయంలో పనిచేస్తున్న న్యాయవాదుల సంఘానికి ఎన్నికలు నిర్వహించడానికి నోటిఫికేషన్ విడుదల చేశారు. గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలు కావడం, పూర్తవడం కూడా జరిగిపోయింది. కాగా బార్ అసోసియేషన్‌లో మొత్తం 12 పోస్టులుండగా అధ్యక్ష, కార్యదర్శితో సహా 28 మంది న్యాయవాదులు నామినేషన్లు దాఖలు చేశారు. అధ్యక్ష పదవికి ఐదుగురు, కార్యదర్శికి ముగ్గురు, ఉపాధ్యక్ష పదవికి ఇద్దరు, కోశాధికారి, సాంస్కృతిక కార్యదర్శి పదవులకు ముగ్గురు చొప్పున, లైబ్రరీ కార్యదర్శికి ఇద్దరు, సీనియర్–జూనియర్ కార్యనిర్వాహక సభ్యులుగా నలుగురు చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు. ఇక సంయుక్త కార్యదర్శి, క్రీడా కార్యదర్శుల స్థానాలకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో అవి ఏకగ్రీవం అయ్యే అవకాశం కనిపిస్తోంది. శుక్రవారం నామినేషన్ల పరిశీలన పూర్తి చేసి, బరిలో ఉన్న న్యాయవాదుల వివరాలు ప్రకటిస్తారు. శనివారం నామినేషన్ల ఉపసంహరణ పూర్తయ్యాక.. అదే రోజు తుదిగా బరిలో ఉన్న అభ్యర్థుల వివరాలు ప్రకటించనున్నట్టు ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న సీనియర్ న్యాయవాది వసంతకుమార్ తెలిపారు. జనవరి 3వ తేదీన బార్ అసోసియేషన్‌కు ఎన్నికలు, అదే రోజు ఫలితాల వెల్లడి జరుగుతుంది. దాదాపు 339 మంది ఓటర్లుగా ఉన్నారు. ఎన్నికల ప్రక్రియను బార్ కార్యదర్శి అశోక్ ఆనంద్ యాదవ్, మరో న్యాయవాది రఘురామ్ పర్యవేక్షించారు.

కొండెక్కిన చెక్‌డ్యామ్‌ల నిర్మాణం..!

- పలుచోట్ల దెబ్బతిన్న వైనం
- ఇసుక తవ్వకాల కోసం కొన్ని చెక్‌డ్యామ్‌లు ధ్వంసం
- నది ప్రవహించినప్పుడల్లా వృధా అవుతున్న నీరు
- నీళ్లు లేక ఎండడంతో బీళ్లుగా మారిన పొలాలు



కూర్మాయి వద్ద కౌండిన్య నదిలో దెబ్బతిన్న చెక్‌డ్యామ్, (ఇన్‌సెట్) ముసలిమొడుగు వద్ద గతంలో చెక్‌డ్యామ్ బాగున్నప్పుడు నిల్వ ఉన్న నీరు (ఫైల్)

పలమనేరు: జిల్లాలోని పడమటి నియోజకవర్గాల్లో ఎక్కువగా కరువు పరిస్థితులు వెంటాడుతుంటాయి. ఈ ప్రాంతంలో ఎక్కువగా వర్షాధారం, బోర్లపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. పొరుగునే ఉన్న కర్ణాటక రాష్ట్రంలో భారీ వర్షాలు కురిస్తే నియోజకవర్గంలోని కౌండిన్య, కై గల్, ఎరిగినేరు నదులు ప్రవహిస్తుంటాయి. ఈ నదుల నీటిని నిల్వ చేసేందుకు వీటిపై ఎలాంటి ప్రాజెక్టులు లేవు. ఫలితంగా నీరు మొత్తం తమిళనాడులోని మోర్ధన డ్యామ్‌కు చేరి వారికి మేలు కలుగుతోంది. ఈ నేపథ్యంలో కౌండిన్య నదిపై అక్కడక్కడా గతంలో చెక్‌డ్యామ్‌లను నిర్మించారు. నది ప్రవహించినప్పుడు వీటిలో నీరు నిల్వ ఉండేది. దీంతో నదిలో నీటి ప్రవాహం ఆగినా చెక్‌డ్యామ్‌లలోని నీటి మూలాన భూగర్భజలాల మట్టం పెరిగి రైతుల బోర్లలో నీరు పుష్కలంగా ఉండేది. వీటి ఆధారంగా పంటలు సాగు చేసేవారు. కానీ నదిలోని పలు చెక్‌డ్యామ్‌లు దెబ్బతిన్నాయి. మరికొన్ని చిన్న డ్యామేజీలున్నా మరమ్మతులు చేయలేదు. కొన్నింటిని ఇటీవల ఇసుకాసురులు ఇసుక కోసం ధ్వంసం చేసేశారు. దీంతో చెక్‌డ్యామ్‌లలో చుక్కనీరు నిల్వ లేకుండా పోయింది. ఫలితంగా ఈపర్యాయం నదికి ఆనుకుని ఉన్న 36 గ్రామాల్లో పంటల సాగు గణనీయంగా తగ్గిపోయింది.

రూ.23కోట్ల అంచనాతో పనులకు ప్రతిపాదనలు

గత ప్రభుత్వంలో కౌండిన్య నదిపై 12చోట్ల చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలకు మైనర్ ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. అయితే వరుసగా మూడేళ్లు భారీ వర్షాల కారణంగా నదిలో నీరు పారింది. దీనిమూలాన పనులు చేసేందుకు వీలు కాలేదు. ప్రస్తుతం అధికారంలోకి కూటమి ప్రభుత్వానికి అదే అంచనాలతో పనులు చేచేయాలని చీఫ్ ఇంజినీర్‌కు పంపింది. కానీ ప్రభుత్వం నుంచి ఈ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇస్తుందా, లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

36 గ్రామాలకు మేలు కలిగేది

కౌండిన్య నది పుంగనూరు నియోజకవర్గం నుంచి పెద్దపంజాణి, గంగవరం, పలమనేరు మండలాల మీదుగా తమిళనాడుకు చేరుతోంది. దీంతో పెద్దపంజాణి మండలంలోని నేలపల్లె, కెళవాతి, దిన్నేపల్లె, కోగిలేరు, గంగవరం మండలంలోని గుండుగల్లు, నల్లగుట్లపల్లె, జీడిమాకులపల్లె, పలమనేరు మండలంలోని నాగమంగళం, బొమ్మిదొడ్డి, కూర్మాయి, క్రిష్టాపురం, ఊసరపెంటల వద్ద నదిపై 12 చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలకు కూటమి ప్రభుత్వం నుంచి మోక్షమెప్పుడో అనే ప్రశ్న రైతాంగంలో మెదలుతోంది.

బీళ్లుగా మారిన పొలాలు

నదికి ఆనుకుని 36 గ్రామాలకు చెందిన వేలాది ఎకరాలకు చెక్‌డ్యామ్‌ల్లో నిల్వ ఉన్న నీటిపై ఆధారపడి పంటలు సాగు చేసేవారు. కానీ అవి దెబ్బ తిని నీరు మొత్తం వృధాగా వెళ్లిపోవడంతో చుక్క నీరు ఉండని పరిస్థితి దాపురించింది. దీంతో ఇసుకాసురులు బాగున్న చెక్‌డ్యామ్‌లను ధ్వంసం చేసిమరీ ఇసుకను తోడేస్తున్నారు! ఇటీవల క్యాటిల్‌ఫామ్ వద్ద బాగున్న చెక్‌డ్యామ్‌లో నీరు నిల్వ ఉన్నందున ఇసుకను తోడేందుకు కాదని కొందరు ఇసుక స్మగర్లు జేసీబీతో డ్యామ్‌ను ధ్వంసం చేయడం గమనార్హం! ఫలితంగా సాధారణ సాగుకంటే ఈసారి పంటల సాగు గణనీయంగా పడిపోయింది. ఇప్పటికైనా పాలకులు కౌండిన్యపై చెక్‌డ్యామ్‌ల పనులను పూనుకోవాలని కౌండిన్య నది సమీప రైతులు కోరుతున్నారు.

మా గ్రామ చెక్‌డ్యామ్‌లో నీళ్లుంటే మూడు గ్రామాలకు మేలు



మా ఊరి వద్ద కౌండిన్య నదిపై చెక్‌డ్యామ్ బాగుండి నీరు నిల్వ ఉంటే ఎంతోమంది రైతులు ఈసారి కూడావరి సాగు చేసేవాళ్లు. దీంతోపాటు భూగర్భజలాలు పెరిగి మూడు గ్రామాల రైతుల బోర్లలో నీటి మట్టం బాగా ఉండేది. ఈ చెక్‌డ్యామ్ పనులు చేయండి సారూ అని నేను కూడా ఉన్నతాధికారులను కోరాను. అయినా పనులు మాత్రం ప్రారంభం కాలేదు.

–కిరణ్, జీడిమాకులపల్లె, గంగవరం మండలం

ప్రభుత్వం అనుమతిస్తేనే..!



గత ప్రభుత్వంలోనూ, ఇప్పుడూ కౌండిన్యలో 12 చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలు, మరమ్మతుల కోసం మా శాఖ నుంచి రూ.23కోట్లతో ప్రతిపాదనలు పంపాం. అవి ప్రస్తుతం విజయవాడలోని చీఫ్ ఇంజినీర్ కార్యాలయం నుంచి ప్రభుత్వానికి పంపారట. వీటిపై ప్రభుత్వం ఆమోదం ఇస్తే టెండర్లు మొదలవుతాయి.

–లక్ష్మీనారాయణ, ఇరిగేషన్ ఏఈ, పెద్దపంజాణి

28న కంటి వైద్య శిబిరం

పుంగనూరు: పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఈనెల 28న ఉదయం 9 గంటల నుంచి ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు చెంగారెడ్డి గురువారం తెలిపారు. శంకర్ నేత్రాలయ వైద్యులు శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తారని, నేత్ర సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతి రైతుకూ ప్రత్యేక గుర్తింపు సంఖ్య

సదుం: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య జారీ చేయనున్నట్లు ఏఓ హరిప్రసాద్ తెలిపారు. ఇందుకోసం రైతు సేవా కేంద్రాలలో గురువారం నుంచి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. జనవరి 21 లోపు పీఎం కిసాన్ లబ్ధిదారులందరికీ ఐడీ నంబర్ ఇస్తామన్నారు. రాబోవు రోజుల్లో వ్యవసాయ సంబంధిత పథకాలకన్నింటికీ ఐడీ నంబర్ అవసరమన్నారు.

జిజ్ఞాస పోటీల్లో కుప్పం విద్యార్థినుల ప్రతిభ


నగదు బహుమతిని అందుకుంటున్న విద్యార్థినులు వర్షిణి, అక్షయ

కుప్పం: గుడుపల్లె మండలం అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌లో నిర్వహించిన జిజ్ఞాస పోటీల్లో కుప్పం బాలికలు ప్రతిభ చాటారు. మట్టి లేకుండా మొక్కల పెంపకం, సామర్థ్యంపై నిర్వహించిన ప్రాజెక్టు పోటీల్లో కుప్పం బాలికల ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థినులు వర్షిణి, అక్షయ ప్రథమ బహుమతిని అందుకున్నారు. వీరికి రూ.3వేల నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలను నిర్వాహకులు అందజేశారు.

భూమి కోసం ధర్నా


తహసీల్దార్ కార్యాలయం ధర్నా చేస్తున్న బాధితులు

- రెవెన్యూ అధికారుల తప్పిదం
- ఒకరి భూమిని మరొకరి పేరిట ఆన్‌లైన్‌లో నమోదు
- భూమిని కాజేసిన వ్యక్తికి కొమ్ము కాస్తున్న బైరెడ్డిపల్లె టీడీపీ నేత
- యథావిధిగా అనుభవదారుల పేరిటే భూమిని మార్చాలని బాధితుల డిమాండ్

గంగవరం: పూర్వీకుల నుంచి సంక్రమించిన భూమి మరొకరి పేరిట మార్చిన రెవెన్యూ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే బాధితుల పేరిటే తిరిగి మార్చాలని డిమాండ్ చేస్తూ జాతీయ మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేశారు. మానవ హక్కుల జిల్లా నాయకులు మునిరత్నం మాట్లాడుతూ, మండలంలోని నడింపల్లెలో సర్వే నంబర్ 691/4–ఏలో పూర్వీకుల నుంచి చెంగప్పకు సంక్రమించిన భూమి సుమారు 2.42 ఎకరాలు ఉందన్నారు. తరతరాలుగా అందులో సాగు చేస్తున్నారని, అయితే చెంగప్ప సమీప బంధువు అనమక్క వీరి భూమిని ఎలాగైనా కాజేయాలని కొన్నేళ్ల క్రితం రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై, తన పేరిట ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్టు తెలిపారు. ఇటీవల ఇది తెలుసుకున్న బాధితులు ఈ పొరబాటును సరిచేయాలని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసినా అధికారులు ఏ మాత్రం స్పందించలేదని విమర్శించారు. దీంతో బాధితులు ఆందోళన చేయాల్సి వచ్చిందన్నారు. మరోవైపు భూమిని అన్యాయంగా కాజేసిన అనమక్కకు బైరెడ్డిపల్లె మండల టీడీపీ నాయకుడు ఇల్లూరి అమర్‌నాథరెడ్డి కొమ్ము కాస్తున్నారని, అధికార బలాన్ని అడ్డు పెట్టుకుని బాధితులైన చెంగప్ప సంతానానికి అన్యాయం చేయడమే కాకుండా వాళ్లను భయభ్రాంతులకు గురి చేయడం దుర్మార్గమన్నారు. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చెంగప్ప వారసులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఇల్లూరి అమర్‌నాథరెడ్డి రాజకీయ వేధింపుల నుంచి బాధితులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలన్నారు. బాధితులకు న్యాయం చేయకపోతే జాతీయ మానవ హక్కుల సంస్థ తరఫున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ధర్నాలో సంస్థ సభ్యులు, బాధితులు పాల్గొన్నారు.

నియామకం

గంగవరం: మండల బీజేపీ అధ్యక్షుడిగా కల్లుపల్లి పంచాయతీ బూడిదపల్లెకు చెందిన నాగరాజు ఎన్నికయ్యారు. గురువారం మండలంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో పార్టీ పెద్దల ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. నాగరాజుతోపాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా పార్లమెంట్ సంయోజక్ రెడ్డిప్రసాద్ తెలిపారు. దీనికి సంబంధించిన నియామక పత్రాలను ఆయనకు అందజేశారు. పలమనేరు అసెంబ్లీ కన్వీనర్ కొంగాటం విజయ్‌కుమార్, కో–కన్వీనర్ ఉమాపతి, బూత్ కమిటీ అధ్యక్షుడు శక్తి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల బీజేపీ అధ్యక్షుడిగా గజేంద్ర

శాంతిపురం: బీజేపీ మండల శాఖ అధ్యక్షుడిగా సోగడబల్లకు చెందిన ఏఎస్ గజేంద్ర ఎంపికయ్యారు. గురువారం శాంతిపురంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నట్టు పార్టీ ఎన్నికల అధికారి వడివేలు కుమార్ తెలిపారు. నియామక పత్రాన్ని నాయకులు గజేంద్రకు అందజేశారు.

28న పుత్తూరులో జాబ్ మేళా

పుత్తూరు: పట్టణంలోని ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 28న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ వి.వీరయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే మెగా జాబ్ మేళాలో 9 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. జాబ్ మేళాలో ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ చదివిన 18 నుంచి 30 ఏళ్ల అభ్యర్థులు అర్హులని వెల్లడించారు. అభ్యర్థులు బయోడేటాతో పాటు సర్టిఫికెట్స్, ఐడీ ప్రూఫ్, రెండు ఫొటోలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని వివరించారు. ఇతర వివరాలకు 98485 53724ను సంప్రదించాలని కోరారు.

గోపినాథ్‌కు నివాళి

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక సంతపేట కూడలిలో మాజీ ఎమ్మెల్యే, మాజీ డీసీసీ అధ్యక్షుడు దివంగత గోపినాథ్ జయంతి సందర్భంగా నివాళి అర్పించారు. ఆయన కుమారుడు వైఎస్సార్‌సీపీ నాయకుడు భూపేష్ ఆధ్వర్యంలో గురువారం గోపినాథ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం అన్నదానం చేశారు. గోపినాథ్ చేసిన సేవలను భూపేష్, పలు సంఘాల నాయకులు కొనియాడారు. తండ్రి పాలనలో చిత్తూరులో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు చిట్టి, శ్రీనివాసులు, విజయ్‌కుమార్, శివ, శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

30న పుంగనూరులో మాలల మహాగర్జన


మాట్లాడుతున్న యమలా సుదర్శన్

పుంగనూరు: పట్టణంలోని బీఎంఎస్‌క్లబ్‌లో ఈనెల 30న మాలల మహాగర్జన సభ నిర్వహిస్తున్నట్లు మాల మహానాడు జాతీయ అధ్యక్షులు యమలా సుదర్శన్ తెలిపారు. గురువారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో రాష్ట్ర కార్యదర్శి ఎన్ఆర్ అశోక్‌తో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. అంబేడ్కర్ సారథ్యంలో రూపుదిద్దుకున్న రాజ్యాంగం కన్నా సుప్రీంకోర్టు గొప్పది కాదన్నారు. అలాంటి రాజ్యాంగాన్ని కాదని మాజీ సీజే వైవీ చంద్రచూడ్ ఇచ్చిన వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇందుకోసమే మాల మహానాడు ఆధ్వర్యంలో సభలు నిర్వహించి, వర్గీకరణపై మరో పోరాటానికి శ్రీకారం చుడుతున్నట్టు చెప్పారు. ఈ మహాసభకు మాలలందరూ పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, రమణ, కమ్మిరెడ్డి, ఆనంద, రామయ్య, మధుబాబు, చంద్రన్న, నాగరాజ, మహానంది, బాలు పాల్గొన్నారు.

బహుజనుల సమస్యల పరిష్కారానికే కమిటీలు


సమావేశమైన బహు జనుల సంఘ సభ్యులు

పుంగనూరు: రాష్ట్ర వ్యాప్తంగా బహుజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసమే కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు గౌరవాధ్యక్షులు కృష్ణమూర్తి, అధ్యక్షులు గంగరాజు తెలిపారు. గురువారం పట్టణంలో బహుజనుల కమిటీ సమావేశం ఏర్పాటు చేసి బీఆర్ఎస్ అని నామకరణం చేశారు. ఆంధ్ర రాష్ట్ర బహుజనుల హక్కుల సాధన సంఘ అధ్యక్షురాలిగా ప్రతిభా భారతి, ఉపాధ్యక్షుడిగా ఎరుకుల వెంకట్రామయ్యను ఎన్నుకున్నారు. అలాగే రాష్ట్ర మైనారిటీ మహిళా ఉపాధ్యక్షురాలిగా షబానా, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శివప్రసాద్, రాష్ట్ర లీగల్ అడ్వైజర్‌గా శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శిగా చిట్టెమ్మ, యువజన మహిళా జిల్లా అధ్యక్షురాలుగా చైత్ర, కోశాధికారిగా సుబ్బన్న, జిల్లా ఉపాధ్యక్షుడిగా నాగరాజును ఎన్నుకున్నారు. బహుజనుల ఐక్యతకు సంబంధించి పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సిగరెట్ల దొంగ అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీఐ

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లెలోని పలు దుకాణాల్లో ఇటీవల సిగరెట్లను దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ మురళీమోహన్ తెలిపారు. ఆయన కథనం మేరకు... కర్ణాటక రాష్ట్రం బాగేపల్లె తాలూకా గొర్తిపల్లె మండలానికి చెందిన లక్ష్మీనారాయణ కుమారుడు దేవేంద్ర తరచూ చోరీలకు పాల్పడేవాడు. దేవదొడ్డి క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా దేవేంద్ర వాలకం అనుమానాస్పదంగా ఉండడంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని పరిశీలించారు. అతడి వద్ద 1,30,000 రూపాయల విలువ చేసే సిగరెట్లు ఉండడంతో స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక విచారణలో బైరెడ్డిపల్లెలోని వివిధ దుకాణాల్లో ఈ సిగరెట్లను చోరీ చేసినట్లు తేలడంతో అతడిని అరెస్ట్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ పరుశురాముడు, పోలీసులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌కు నిప్పు


నిప్పు పెట్టడంతో కాలిపోయిన ట్రాక్టర్

బైరెడ్డిపల్లె: ఇటుక బట్టీలో ఉన్న ట్రాక్టర్‌కు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కాలిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు.. బైరెడ్డిపల్లెకు చెందిన శేషిగాడ్‌కు ట్రాక్టర్ ఉంది. ఆ ట్రాక్టర్ బైరెడ్డిపల్లె సమీపంలోని పెద్దచెరువు వద్ద ఉన్న ఇటుకరాళ్ల ఫ్యాక్టరీలో పనులకు ఉంచాడు. యథావిధిగా బుధవారం సాయంత్రం పనులు ముగిసిన తరువాత అక్కడే ఉంచి, ఇంటికి వచ్చాడు. రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ట్రాక్టర్‌కు నిప్పుపెట్టడంతో అది కాలిపోయింది.

కరెంట్ చార్జీల బాదుడుపై నేడు పోరుబాట

పుంగనూరు: వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించనున్నారు. గురువారం ఈ విషయమై బందోబస్తు , అనుమతి కోరుతూ పోలీసులకు ఎమ్మెల్యే లేఖ రాశారు. మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్ షరీఫ్, వైఎస్సార్‌సీపీ న్యాయవాది పీఎన్ఎస్ ప్రకాష్ వెళ్లి డీఎస్పీ ప్రభాకర్, సీఐ శ్రీనివాసులుకు ఎమ్మెల్యే లేఖలను అందజేశారు. అలీమ్‌బాషా మాట్లాడుతూ, ఎమ్మెల్యే సారథ్యంలో ఉదయం 10 గంటలకు బస్టాండ్‌లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించి పీఎల్ఆర్ రోడ్డులోని ఏపీ ఎస్పీడీసీఎల్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతి పత్రం ఇవ్వనున్నట్లు తెలియజేశారు. ఆఫీసు వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం సమర్పించనున్నట్లు తెలిపారు. నిరసనలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

చలో పుంగనూరు

రొంపిచెర్ల: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన కరెంట్ చార్జీలకు నిరసనగా పుంగనూరులో నిర్వహించ తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డిశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలలకే కరెంట్ చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరుస్తోందని విమర్శించారు. నిరసనలో మండలం నుంచి పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పోరుబాటకు తరలిరండి

సదుం: విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ పుంగనూరులో నిర్వహించనున్న పోరుబాటకు మండలం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, ఎంపీపీ ధనుంజయ రెడ్డి కోరారు. నాయకులు గిరిధర్ రెడ్డి, ఎల్లారెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పలమనేరులో..

పలమనేరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కరెంట్ చార్జీలను పెంచడానికి నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం నిర్వహించ తలపెట్టిన పోరుబాట కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు జయప్రదం చేయాలని పలమనేరు మాజీ ఎమ్మెల్యే ఎన్. వెంకటేగౌడ పిలుపునిచ్చారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా ట్రాన్స్‌కో కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించి ఆపై ట్రాన్స్‌కో అధికారులకు వినతిపత్రం ఇవ్వనున్నట్లు చెప్పారు.

కుప్పంలో..

కుప్పం: విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ శుక్రవారం శుక్రవారం ఉదయం 10 గంటలకు కుప్పంలో ఎమ్మెల్సీ భరత్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ శ్రేణులు తెలిపాయి. బస్టాండులోని వైఎస్సార్ విగ్రహం నుంచి ర్యాలీగా రెస్కో కార్యాలయానికి చేరుకుని ఎండీకి వినతి పత్రం ఇస్తామని, నియోజకవర్గంలోని నాలుగు మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ నేతలు కోరారు.

పోరుబాట విజయవంతం చేయండి

శాంతిపురం: కుప్పంలో నిర్వహించ తలపెట్టిన పోరుబాటకు మండల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, మండల కన్వీనర్ దండపాణి పిలుపునిచ్చారు.

పేదలకు అండగా ఎరజ్రెండా


ర్యాలీగా వస్తున్న రామానాయుడు, నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: పేద, కార్మిక, కర్షకుల అండదండలతో 99 ఏళ్లుగా ఉన్న పార్టీ సీపీఐ అని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.రామానాయుడు అన్నారు. చిత్తూరు నగరంలో గురువారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శతాబ్ది ఉత్సవంలో భాగంగా నగరంలో ర్యాలీ నిర్వహించారు. కోర్టు వద్ద నుంచి గాంధీ విగ్రహం వరకు ఎర్ర జెండాలతో ప్రదర్శనగా వచ్చి కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. 1925 డిసెంబర్ 26 కాన్పూర్‌లో పార్టీని ప్రారంభించిన విషయం గుర్తు చేశారు. నాడు సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం అలుపెరిగిన పోరాటం చేసి పలువురు జైల్లుకి వెళ్లి, ప్రాణాలు త్యాగాలు చేశారన్నారు. దేశంలో అందరికీ విద్య, ఉపాధి, కార్మిక హక్కులు, భూ సంస్కరణలు, అంటరానితనం వంటి సమస్యలపై పోరాడి పలు చట్టాలు సాధించామన్నారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా నడిపిన సాయుధ పోరాటంలో 4 వేల మంది కమ్యూనిస్టులు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఆ పోరాటంతో 10 లక్షల ఎకరాల భూమి పంపిణీ జరిగిందన్నారు. భాషా సంయుక్త రాష్ట్రాల కోసం తమ వంతు పోరాటాలు చేశామన్నారు. తమ పార్టీ పోరాటాలతో దేశంలో బ్యాంకుల జాతీయకరణ, గరిష్ట పరిమితి చట్టాలు వచ్చాయన్నారు. నేడు దేశంలో అభివృద్ధి నిరోధక శక్తుల పాలనలో హక్కులు హరించుకుపోతున్నాయన్నారు. దేశ సంపద మొత్తం కొందరి కార్పొరేట్ సంస్థల పరం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజ్, సహాయ కార్యదర్శి డా.టి.జనార్దన్ నాయకులు గోపీనాథ్, మణి, దాసరిచంద్ర, విజయకుమార్, రఘు, దామోదరం, మంజునాథ్ బాబు, మున్నా, విజయ్ గౌరి, రమాదేవి, కుమారి, జమీలాబి పాల్గొన్నారు.